# తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

## జేడీఏ డీ ఉషాదయాల్


పత్తి పంటను పరిశీలిస్తున్న జేడీఏ ఉషాదయాల్

వర్ధన్నపేట, అక్టోబర్ 4 : పత్తి పంటలో ప్రస్తు తం ఆశిస్తున్న తెగుళ్లను నివారించేందుకు రైతులు సిద్ధంగా ఉండాలని వరంగల్ జిల్లా వ్యవసాశాఖ అధికారి డీ ఉషాదయాల్ తెలిపారు. మండలం లోని డీసీతండా, ఇల్లంద, వర్ధన్నపేట శివారులో ని వరి, పత్తి, కంది పంటలను ఆమె అధికారుల తో కలిసి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటలో ప్రస్తుతం గులాబీ రంగు పురుగు కనిపిస్తున్నదని తెలిపారు. గులాబీరంగు పురుగు ఆశించే గడ్డిపూలను ఏరివేసి నాశనం చేయడంతోపాటు ఎకరాకు 4నుంచి 8లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అలాగే మొదటిదశలో గుడ్లను, చిన్నచిన్న లార్వాలను చంపేయడానికి ప్రొఫినోపాస్ 2 మిలీటర్లుకానీ, థమోడికార్స్ 1.5 గ్రామాలు కానీ, క్వినాల్‌ఫాస్ 2మిలీటర్లు కానీ, క్లోరిఫైరిపాస్ 2.5 మిలీటర్లు కానీ లీటరు నీటిలో కలిపి పది రోజులకు ఒకసారి పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే కాయలు బాగా పెరిగి పురుగు ఉధృతిని బట్టి 0.5 గ్రామాల ఇమామెక్టిన్ బెంజోమెట్‌ను పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే కంది పంటలో ఆకు చుట్టు పురుగు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీని నివారణకు 1.6మిలీటర్ల మోనోక్రోటోఫాస్ కానీ, 2 మిలీటర్ల క్వినాల్‌ఫాస్ కానీ, 2.5మిలీటర్ల క్లోరోఫైరిఫాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని ఆమె తెలిపారు. అలాగే వరి లో కాండంతొలుచు పురుగు, అగ్గితెగులు, బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులు నివారణకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలతో మందులను పిచికారీ చేసుకోవాలని జేడీఏ సూచించారు. ఏఈవోలు అందుబాటులో ఉంటూ సూచనలు చేయాలని జేడీఏ ఆదేశించారు. ఎన్ఎఫ్ఎస్ఎం అధికారి సారంగం, ఏరువాక శాస్త్రవేత్తలు దిలీప్‌కుమార్, విశ్వతేజ, ఏవో రాంనర్సయ్య, ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

# నేడు మంత్రి ఎర్రబెల్లి 'తండా బాట'

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- గిరిజనుల సమస్యలను తెలుసుకోనున్న దయాకర్‌రావు
- వివరాలు వెల్లడించిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహానాయక్


ఏకేతండాలో శిలాఫలక గద్దె నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నర్సింహానాయక్


రాయపర్తి, అక్టోబర్ 4 : రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖామాత్యులు ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం మండలంలోని పలు గిరిజన గ్రామ పంచాయతీల్లో తండాలబాట పేరుతో పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటైన గిరిజన తండాల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యటించి ప్రజా సమస్యలను, గిరిజనుల సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలను అడిగి తెలుసుకోనున్నట్లు ఆయన వివరించారు. అదేవిధంగా కోట్లాది రూపాయలతో చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మంత్రి ఎర్రబెల్లి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, భూమిపూజ కార్యక్రమాలు చేపడుతారన్నారు. ప్రజలు మంత్రి ఘన స్వాగతం పలికి తమ సమస్యలను నివేదించుకోవాల్సిందిగా ఆయన కోరారు. మంత్రి ఎర్రబెల్లి తండాల బాట కార్యక్రమం ఉదయం 8:30గంటలకు అవుసుల కుంటతండా, 9:30గంటలకు సూర్యతండా, 10:30 గంటలకు బాలాజీతండా, 11:30గంటలకు బాలునాయక్‌తండా, 1:30గంటలకు జయరాంతండా(ఎస్), 2:30గంటలకు దుబ్బతండా, 3:30గంటలకు పానీష్‌తండాల్లో పర్యటించనున్నట్లు ఆయన వివరించారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువత, అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

## గ్రామాల్లో ఉచిత లెర్నింగ్ లైసెన్స్‌లు పంపిణీ

రాయపర్తి, అక్టోబర్ 4 : మండలంలోని ఊకల్, కొండాపురం గ్రామాల్లో బుధవారం సర్పంచులు కుంచారపు హరినాథ్, కోదాటి దయాకర్‌రావుల సారథ్యంలో వాహనదారులకు లెర్నింగ్ లైసెన్స్‌లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం, మండల వ్యవసాయ శాఖల ఆవరణలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేశారు. పలు శాఖల ప్రతినిధులు కుందూరు రాంచంద్రారెడ్డి, నాగపురి రాంబాబు, ఉపేందర్‌రెడ్డి, బొడ్డు రంగయ్య, గొల్లపల్లి సదాశ్రీను, వీరబ్రహ్మం, లెక్కల ప్రవీణ్‌రెడ్డి, తేరాల యాకయ్య పాల్గొన్నారు.

## తపాలా ఉద్యోగుల ఒక్కరోజు సమ్మె

రాయపర్తి, అక్టోబర్ 4 : తపాలాశాఖ ఉద్యోగులతో కేంద్ర ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటున్నదని ఆల్ ఇండియా గ్రామీణ్ డాక్ సేవక్స్ యూనియన్ మండలాధ్యక్షుడు మహ్మద్ అబిద్‌పాషా ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో ఉద్యోగులు విధులు బహిష్కరించి ఒక్క రోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా అబిద్‌పాషా మాట్లాడుతూ రోజుకు 8 గంటల పని విధానంతోపాటు పింఛను సహా అన్ని ప్రయోజనాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ మహ్మద్ మౌలానా, మైస చందర్, టీ చారి, సోమరాజు, అర్జున్, తరుణ్, మహేశ్, నరేశ్‌కుమార్, దీపిక, అనిత, మోహన్, యాకయ్య పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి

## బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేత

హసన్‌పర్తి, అక్టోబర్ 4 : గ్రేటర్ ఒకటో డివిజన్ ముచ్చర్లకు చెందిన మట్టెడ సారయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ సూచన మేరకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఆయన వెంట పులెట్ల శ్రీధర్, శ్రావణ్, కరుణాకర్, అనిల్, ప్రవీణ్, బాబు ఉన్నారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

రాయపర్తి, అక్టోబర్ 4 : మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు బుధవారం పర్యటించారు. మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంక్షేమ సంఘ సభ్యుడు ముద్రబోయిన రమేశ్, గణేశ్‌కుంటతండాలో మూడు పోలీ, మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన రసాల పెంటయ్య, బలగం యాకయ్య, నాయిని వెంకటయ్యలు ఇటీవల పలు కారణాలతో మృతి చెందగా మృతుల కుటుంబాలను కలిసి పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, జడ్పీటీసీ రంగు కుమార్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ ఆకుల సురేందర్‌రావు, మండల నాయకులు గారె నర్సయ్య, అయిత రాంచందర్, పూస మధు, ముద్రబోయిన సుధాకర్, మహ్మద్ అక్బర్, పూజారి సంతోష్ కుమార్, మునావత్ చత్రూనాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

## బంధన్‌పల్లి విద్యార్థినికి బ్యాడ్మింటన్‌లో సిల్వర్ మెడల్


మెడల్స్ అందజేస్తున్న ప్రతినిధులు, అధికారులు

రాయపర్తి, అక్టోబర్ 4 : మండలంలోని బంధన్‌పల్లి గ్రామ పరిధిలోని ఓ మారుమూల గిరిజన తండాకు చెందిన 6వ తరగతి విద్యార్థిని అయిన భూక్యా మనస్విని బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకుంది. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ స్టేట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సారథ్యంలో తెలంగాణ స్టేట్ మీట్ మినీ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న మనస్విని పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకున్నట్లు కోచ్ శ్రీధర్ తెలిపారు. మనస్వినికి డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఎస్‌హెచ్‌వో దయాకర్, సూపర్‌వైజర్ రవి అవార్డులను ప్రదానం చేశారు. మనస్వినిని బంధన్‌పల్లి గ్రామ సర్పంచ్ భూక్యా దీప్లానాయక్‌తో పాటు గ్రామస్తులు అభినందించారు.

# సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం


మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవి

కృష్ణకాలనీ, అక్టోబర్ 4 : వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయడంతోపాటు మ ధ్యంతర భృతిని ప్రకటించిన సీఎం కేసీఆర్ కు రుణపడి ఉంటామని తెలంగాణ నాన్ గె జిటెడ్ ఆఫీసర్స్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎస్‌జీవోఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను మంజూరు చేసి, ఉద్యోగులనూ తన హెల్త్ స్కీంను వెంటనే అమలు చేయాలని మంత్రి హరీశ్ రావును కోరామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారన్నారురు. సమావేశంలో కార్యదర్శి హరికృష్ణ, కోశాధికారి దశరథ రామారావు తదితరులు పాల్గొన్నారు.


కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సునీత, ఎంపీడీవో రామకృష్ణ

## కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు, బతుకమ్మ చీరెల పంపిణీ

హసన్‌పర్తి, అక్టోబర్ 4 : క్రీడలకు తెలంగాణ సర్కారు పెద్దపీట వేస్తుందని ఎంపీపీ కేతపాక సునీత తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సునీత ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల పరిధిలోని తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు సంబంధించిన 15గ్రామాలకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతం 15గ్రామాలను సంబంధించిన బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, వైస్‌ఎంపీపీ బండ రత్నాకర్ రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్‌కుమార్, జడ్పీటీసీ సునీత, పాక్స్ చైర్మన్ జక్కు రమేశ్‌గౌడ్, ఎంపీవో రవిబాబు, ఏపీవో విజయలక్ష్మి, వివిధ గ్రామాల సెక్రటరీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## 9న ములుగురోడ్ ఐటీఐలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అడ్మిషన్‌కు 5వ విడత వాక్ ఇన్ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ ఈనెల 8లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ మెరిట్ ప్రాతిపదికన మాత్రమే సీట్లు కేటాయించబడతాయని, 9న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు వరంగల్ ప్రభుత్వ ఐటీఐ కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎల్ జుమ్లానాయక్ తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఇంతకుముందు నమోదు చేసుకోని వారు కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో నిజధ్రువ పత్రాల ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలపై కేయూలో అవగాహన సదస్సు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 4 : తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలపై బుధవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్స్ కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో డీన్ ప్రొఫెసర్ వై నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్, ప్రొఫెసర్ కృష్ణవేణి, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఔషధ తనిఖీ అధికారుల సంఘం జాతీయ అధ్యక్షుడు గుండెమీది కోటేశ్వరరావు హాజరై మాట్లాడారు. ఈ నెల19నుంచి నవంబర్ 9వరకు పోస్టల్ బ్యాలెట్ పద్ధతి ద్వారా తెలంగాణ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్‌కు సంబంధించిన ఆరుగురు సభ్యుల ఎన్నికల కోసం ఎన్నికల విధివిధానాలను విశదీకరించారు. రిజిస్టర్ పోస్టు ద్వారా వచ్చిన బ్యాలెట్ పేపర్‌ని నింపిన తర్వాత, మళ్లీ రిజిస్టర్ పోస్టులో కౌన్సిల్ అడ్రస్‌కు నవంబర్ 9వ, 2023 సాయంత్రం 5గంటల వరకు అందేలా పంపాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా బ్యాలెట్ పేపర్లు ఇతరుల చేతిలో పెట్టొద్దని, దీనివల్ల క్రిమినల్ కేసులతోపాటు, రిజిస్ట్రేషన్ కూడా క్యాన్సల్ అయ్యే అవకాశం ఉంటుందని ఆయన హెచ్చరించారు. ప్రొఫెసర్ వై నరసింహారెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు ఫార్మసీకి, మెడిసిన్స్‌కు సమానంగా ఉండేదని, ఇప్పుడు ఫార్మసీ గ్రాడ్యుయేట్స్ సర్టిఫికెట్స్ రెంటుకు ఇవ్వడం వలన వాటి విలువలు పడిపోయాయని, ఏఐసిటీలో ఫార్మసీ కోర్సు అనుబంధంగా ఉంటే క్యూఐపీ కోటా కింద ఎంఫార్మసీ, పీహెచ్‌డీ చేసుకునే అవకాశం ఉండేదని, అది ఇప్పుడు లేదన్నారు. ప్రస్తుతం ఫార్మసి కౌన్సిల్ ఆఫ్ ఇండియా చేతిలోకి వెళ్లిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ సమ్మయ్య మాట్లాడుతూ సివిల్ సర్వీసులో ఫార్మసీ సబ్జెక్టులని చేర్చాలని, ఎలక్షన్ మ్యానిఫెస్టోలో ఫార్మసిస్ట్ కం ఓనర్ అనే జీవోను గవర్నమెంట్ తీసుకురావాలని, బీఫార్మసీ డీ ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు సొంత ఫార్మసీని నడిపించుకునే వీలుతోపాటు సబ్సిడీ లోను సౌకర్యం కల్పించాలని, అర్హత లేని వ్యక్తులు నడిపే మందుల షాపులను వెంటనే రద్దుచేయాలన్నారు. ఆరోగ్య ఫార్మసీ ఎండీ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తను ప్రొఫెషనల్ సర్వీసు సమాజానికి ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో విద్యార్థులు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఓటు హక్కును వినియోగించుకుంటామన్నారు.


కేయూలో బ్యాలెట్ పేపర్‌తో అవగాహన కల్పిస్తున్న కోటేశ్వర్‌రావు